క్లుప్తంగా

ఎరువు దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ

ఆత్మకూరు: పట్టణంలోని రసాయన ఎరువుల దుకాణాలను మంగళవారం ఇంటర్నల్ స్క్వాడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు ఎరువుల దుకాణాల్లోని ఎరువులను, రికార్డులను నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, ఆత్మకూరు ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఏడీఓ మాట్లాడుతూ ఎరువులను ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ–పీఓఎస్ ద్వారానే అమ్మకాలు కొనసాగించాలన్నారు. స్టాఫ్ రిజిస్టర్లను, బిల్లు బుక్కులు సక్రమంగా నిర్వహించాలని ,బిల్లు పుస్తకాలపై రైతులతో సంతకాలు చేయించాలని చెప్పారు.

కో ఆర్డినేషన్ సమావేశం వాయిదా

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నంద్యాలలో మంగళవారం నిర్వహించాల్సిన సమావేశం ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆర్డీఓ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

కుమారస్వామికి విశేషపూజలు



స్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. స్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

శ్రీశైలంలో ప్రవచనాలు

శ్రీశైలంటెంపుల్: ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీశైలదేవస్థానం శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఈఓ ఎస్ లవన్న మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మప్రచారం, ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా దేవస్థానం ప్రఖ్యాత ప్రవచకులు డాక్టర్ బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మచే ప్రవచనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శివనామ మహిమపై ఈ ప్రవచనాలను ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్య కళారాధన వేదికపై మూడు రోజుల పాటు ప్రతి రోజు 7 నుంచి 9 గంటల వరకు ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఇస్కాలలో పశు వైద్యశిబిరం



పశువుకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భాస్కర్

పాములపాడు: మండలంలోని వేంపెంట పశు వైద్య కేంద్రం పరిధిలోని ఇస్కాల గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పశు వైద్యాధికారి భాస్కర్ 15 దూడలకు నట్టల నివారణ మందులు, 24 పాడి పశవులకు చికిత్స, చూడీ పరీక్షలు నిర్వహించి మినరల్ మిక్చర్, కాల్షియం టానిక్‌లు అందజేశారు. 13 ఎద్దులకు ఆవులకు చికిత్సలు చేశారు. గొర్రెలు, మేకలను మందలను పరిశీలించి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తిరుపతమ్మ, మనీష్, ప్రసన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

మిడుతూరు: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ శివకుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. సీజనల్ వ్యాధులు, సాధారణ జబ్బుల పట్ల అవగాహన కలిగిఉండాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ రవికుమార్, సూపర్‌వైజర్ ఏసేపు, ఏఎన్ఎం, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి పట్టణంలోని అన్ని వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, కో ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

పుష్కలంగా ఎరువులు

- ఆర్బీకేల్లో, ప్రైవేట్ దుకాణాల్లో టన్నుల కొద్దీ నిల్వలు
- ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మకాలు
- రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే ఎరువులు అందుబాటులో



ఆత్మకూరులోని ఓ దుకాణంలో నిల్వ ఉన్న ఎరువులు

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పుడు నుంచి రైతులకు కావాల్సిన ఎరువులు పుష్కలంగా లభిస్తున్నాయి. గ్రామాల్లో, పట్టణాల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు మండల కేంద్రాలకు వెళ్లకుండా సొంత గ్రామాల్లోనే ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. వరి, మొక్కజొన్న, మిరప, వేరుశనగ తదితర పంటలకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

ఆర్బీకేలు, ప్రైవేట్ దుకాణాల్లో నిల్వలు ఇలా..

ఆత్మకూరు మండలంలో ఆర్బీకే కేంద్రాల్లో డీఏపీ, యూరియా తదితర అన్ని రకాల ఎరువులు 129 మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా ప్రైవేట్ దుకాణాలలో 345 మెట్రిక్ టన్నులు, వెలుగోడు మండలంలో ఆర్బీకేల్లో 88 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ దుకాణాల్లో 400 మెట్రిక్ టన్నులు , పాములపాడు మండలంలో ఆర్బీకేల్లో 74 మెట్రిక్‌టన్నులు, ప్రైవేట్ దుకాణాల్లో 420 మెట్రిక్‌టన్నులు , కొత్తపల్లి మండలంలో ఆర్బీకేలో 31 మెట్రిక్‌టన్నులు, ప్రైవేట్ దుకాణాల్లో 128 మెట్రిక్‌టన్నుల చొప్పున రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ప్రతి మండలంలో రైతులు సాగు చేసిన పంటలకు పుష్కలంగా ఎరువులు లభ్యం అవుతున్నాయి.

ఎమ్మార్పీకే ఎరువులు లభ్యం

రైతులకు కావాల్సిన ఎరువులు ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఎమ్మార్పీ ధరకే ఆర్బీకే, ప్రైవేట్ దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 3,507 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయగా, ఇందులో రైతులు ఇప్పటి వరకు 3,309 మెట్రిక్‌టన్నుల ఎరువులు కొనుగోలు చేశారు. ఇంకా రైతు భరోసా కేంద్రాలు, ఎరువుల దుకాణాల వద్ద 198 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు యూరియా రూ.267 చొప్పున విక్రయిస్తున్నారు. ఇంకా మిగిలిన కాంపోస్ట్ ఎరువుల కూడా ప్రభుత్వ నిర్ణయించిన ఎమ్మార్పీలకే అమ్మకాలు చేయడంతో రైతులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు.

బ్లాక్‌లో విక్రయిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం



ఆత్మకూరు డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్, రబీలలో ఎక్కడా ఎరువుల కొరత లేదు. రైతులకు కావాల్సిన ఎరువులు ఆర్బీకే, ప్రైవేట్‌దుకాణాల్లో పుష్కలంగా ఉన్నాయి. ఎమ్మార్పీలకంటే అధికంగా ఎరువులు విక్రయించినట్లు రైతులు తమకు ఫిర్యాదు చేస్తే ఆ దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం.

– ఆంజనేయులు, ఏడీఏ, ఆత్మకూరు

ఎరువులు పుష్కలంగా అందాయి



ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగు మొదలుకుని ఇప్పటివరకు రైతులకు కావల్సిన ఎరువులు పుష్కలంగా అందించారు. ఏ ఎరువులు కావాలన్నా..ఆర్బీకే కేంద్రాల్లో, ప్రైవేట్ దుకాణాల్లో లభ్యం అయ్యాయి. ఎప్పుడు ఎరువులు కావాల్సి వస్తే అప్పుడు కొనుగోలు చేశాం. ఎరువుల గురించి ఇబ్బంది పడలేదు.

– మహబూబ్‌బాషా, రైతు, ఆత్మకూరు

రైతు భరోసా కేంద్రంలోనే ఎరువులు కొనుగోలు చేశాం



ఆత్మకూరు మండలం, సిద్ధాపురం చెరువు కింద ఈ ఏడాది ఖరీఫ్, రబీలో వరి పంట సాగు చేశాం. ఈ పంటకు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు వినియోగించాం. ఈ ఎరువులన్నీ మా ఊరి ఆర్బీకేలో కొనుగోలు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్బీకేల వలన రైతులకు ఎరువులు తీసుకోవడం చాలా సులభతరమైంది. ఈ ఏడాది రెండు సార్లు ఆర్బీకేలోనే ఎరువులను కొనుగోలు చేశాను.

– వెంకటేశ్వరనాయక్, రైతు, ఎస్ఎస్‌తండా, ఆత్మకూరు మండలం

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జూపాడుబంగ్లా: రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వ నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ శ్రీధర్ హెచ్చరించారు. మంగళవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరులోని రెండు రైతు భరోసా కేంద్రాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ శ్రీధర్ అధ్వర్యంలో ఎస్ఐ షణ్ముఖ, సిద్ధయ్య తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఆర్బీకేలోని రికార్డులను, పరికరాలను పరిశీలించారు. రైతుల వద్దకు వెళ్లి వారు పొందిన యంత్రపరికరాలను పరిశీలించారు. పరికరాలను సద్వినియోగం చేసుకొంటున్నారా? వాటివల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరిందనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రబీలో ఈక్రాప్ బుకింగ్ నమోదు చేసిన పంటపొలాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు పక్కాగా నమోదు చేశారా లేదా అనే విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణి, ఆర్బీకే సిబ్బంది రోహిత, భావన, రైతులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

రేపు కొలనుభారతిలో అమ్మవారి ఉత్సవం



కొలనుభారతి క్షేత్రంలో వెలసిన సరస్వతీదేవి

పాములపాడు: కొత్తపల్లి మండలంలోని కొలను భారతీదేవి క్షేత్రంలో ఈ నెల 26న పుట్టిన పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి మోహన్ మంగళవారం తెలిపారు. వసంత పంచమి సందర్భంగా మాఘ శుద్ధ పంచమి ఈ నెల 26న ఉదయం 5.30గంటలకు శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవస్థానం వారు సమర్పించిన పట్టు వస్త్రాలతో సరస్వతీ దేవి అమ్మవారికి అలంకరణ ఉంటుందన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరవుతారని చెప్పారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో వెలసిన శ్రీసరస్వతి అమ్మవారికి శ్రీశైల దేవస్థానం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ప్రతి సంవత్సరం వసంతపంచమి రోజున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు శ్రీశైలదేవస్థానం అధికారులు, అర్చకస్వాములు, వేదపండితులు సిబ్బంది కొలను భారతి క్షేత్రానికి వెళ్లనున్నారు.

రేపు వసంత పంచమి వేడుకలు

బండిఆత్మకూరు: కాకనూరు గ్రామంలోని సరస్వతీ దేవి ఆలయంలో ఈ నెల 26వ తేదీన వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు శివయోగేంద్ర సరస్వతి తెలిపారు. అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో క్షేత్రానికి వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మల్లన్నను దర్శించుకున్న మంత్రాలయం ఎమ్మెల్యే

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

వృద్ధాప్య సమస్యలపై అవగాహన

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని అఖిల భారత రెడ్ల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో స్థానిక మండల ఆరోగ్య కేంద్రం వైద్యుడు సోమశేఖర్ సోమవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వృద్ధులందరికీ బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామారావు, ఏఎన్ఎమ్ నాగేంద్రమ్మ, ఆశావర్కర్ నాగమణి పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు'ను ప్రైవేటీకరిస్తే దేశ వ్యాప్త ఉద్యమం

ఆత్మకూరు: రాష్ట్రంలోని విశాఖ ఉక్కు కార్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే కేంద్ర ప్రభుత్వంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సుంకన్న అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నెల 30న విశాఖలో లక్ష మంది కార్మికులతో కార్మిక గర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ప్రతాప్, ఏసేబు, శివుడు, అహ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని కురువపేటలో బుధవారం ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆదేశించారు.

వివేకానంద పాఠశాల వ్యవస్థాపకుడి మృతి



వెంకటరెడ్డి(ఫైల్)

మహానంది: మహానందిలోని ప్రసిద్ధి చెందిన వివేకానంద పాఠశాల వ్యవస్థాపకుడు, కరస్పాండెంట్ ఏరువ వెంకటరెడ్డి(86) మంగళవారం మృతి చెందారు. నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఆయన కుమారుడు రుక్మాంగధర్‌రెడ్డి తెలిపారు. వెంకటరెడ్డికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి

- అధికారులకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆదేశం
- 80బన్నూరు, పోతులపాడు, చాబోలు గ్రామాల్లో 'గడప గడపకు మనప్రభుత్వం'



80బన్నూరులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, అధికారులు

జూపాడుబంగ్లా: ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ వహించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సూచించారు. మంగళవారం మండలంలోని 80బన్నూరు, పోతులపాడు, చాబోలు గ్రామాల్లో సర్పంచ్ పల్లెనిర్మలమ్మ అధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని చిన్న చిన్న సమస్యలు తమ వరకూ మండలస్థాయి, గ్రామపంచాయతీ అధికారులు కలిసికట్టుగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైనవారందరికీ ఇళ్లస్థలాలు, ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ రోజూ గ్రామంలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై వారి ద్వారా గ్రామాల్లోని సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయటంతోపాటు, వాటిని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, ప్రభుత్వ భవనాల మంజూరు తదితర సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు తమదృష్టికి తీసుకొస్తే మంజూకు కృషి చేస్తానన్నారు.

అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి ఆదేశం

80బన్నూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఒకటోవ కేంద్రం నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన విద్యాబోధనతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా చేయాలని సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మను ఆదేశించారు. 80బన్నూరు, పోతులపాడు, చాబోలు గ్రామాల్లోని ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజుల వాణి, రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివానందరెడ్డి, మహేశ్వరమ్మ, రమేష్‌గౌడు, దేవసహాయం, జంగాలపెద్దన్న, కరుణాకర్ రెడ్డి, తాటిపాడు ఉస్మాన్‌బాషా, తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, తరిగోపుల కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగటూరు సుధాకర్‌రెడ్డి, దుద్యాల రఫి పాల్గొన్నారు.

'స్వామినాథన్' సిఫారసులు అమలు చేయాలి

మిడుతూరు: స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన మిడుతూరులో రైతు వ్యవసాయ కార్మికులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, కౌలు రైతుల రుణాలు రద్దు చేయాలని, విద్యుత్ బిల్లులు వెనక్కు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఓబులేసు, రామకృష్ణ, వేణుగోపాల్, లింగస్వామి, శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: అంగన్‌వాడీ వర్కర్ల వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, హరిత కోరారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచాలని రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు తులసమ్మ, రమణమ్మ, వెంకటలక్ష్మమ్మ, శ్రీదేవి, రాజమ్మ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



జంగిల్ క్లియరెన్స్ పనులు పర్యవేక్షిస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది ఆలయానికి వచ్చే భక్తులకు గతేడాది కంటే మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలో మంగళవారం జంగిల్ క్లియరెన్స్ పనులు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఆలయ పరిసరాలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ ఏడాది నూతనంగా దేవస్థానం స్థలంలోనే వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలో సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో వాహనాల పార్కింగ్ ఉండేదని, ఈ ఏడాది ఆలయానికి దగ్గరలోనే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శివరాత్రి(జాగరణ) రోజున భక్తుల కాలక్షేపానికి, కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి చెక్కభజన పోటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కేరళ రాష్ట్రానికి చెందిన కళాకారులతో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వీటితో పాటు మరిన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు చైర్మన్ కొమ్మా మహేశ్వర్‌రెడ్డి, ధర్మకర్తలతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

అదనపు విద్యుత్ స్తంభాల ఏర్పాటు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది క్షేత్రంలో 20 అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మహానందిలో మంగళవారం విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పల్లకీ ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా స్తంభాల ఎత్తును పెంచినట్లు తెలిపారు. విద్యుత్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

ఆర్థిక సాయం



సువర్ణకు నగదు అందజేస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో పనిచేస్తున్న ఆర్ శివానంద అనే కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందడంతో ఆయన సతీమణి ఆర్ సువర్ణకు దేవస్థాన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం ఈఓ కార్యాలయంలో ఈఓ ఎస్ లవన్న చేతులమీదుగా మృతుని భార్యకు రూ.2,75,948లను అందజేశారు. దేవస్థానంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారు.

బాలికల చదువుతోనే సమాజాభివృద్ధి

- ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



బైర్లూటి గిరిజన పాఠశాలలో కేక్‌కట్ చేస్తున్న డీఎల్‌పీఓ కవిత

ఆత్మకూరు: బాలికలు చదువుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆత్మకూరు డివిజన్ డీఎల్‌పీఓ కవిత, ఎంఈఓ జానకీరాం అన్నారు. మండలంలోని బైర్లూటి చెంచుగూడెంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలికలు చదువుకున్నప్పుడే సమాజంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి విద్యార్థినులకు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో:

పట్టణంలోని కస్తూరిబా పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి కేక్‌కట్ చేసి విద్యార్థినులకు పంపిణీ చేశారు.

బాలికల సంరక్షణ మనందరి బాధ్యత

మిడుతూరు: బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని ఎంఈఓ మౌలాలి, సీడీపీఓ కోటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓ ఉమాగైర్వాణి, పీఈటీ సుమలత, ఏఎస్ఐ సుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకదేవి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు అని ఇన్‌చార్జ్ హెచ్ఎం గోపాల్ అన్నారు. సోమవారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ దేవానంద్, సూపర్‌వైజర్లు అంజలి, లలిత, ప్రభావతి, మహిళా పోలీసు సుమిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

పగిద్యాల: నేటి బాలలే రేపటి బావిభారత పౌరులని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. సమ్మెటీవ్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు ఎంఈఓ సుభాన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిణి జరీనా, ఏపీఎం శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

జూపాడుబంగ్లా: ఆడపిల్లల పట్ల చిన్నచూపు తగదని జూపాడుబంగ్లా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్‌లో బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆడపిల్లలు, మహిళల ప్రాముఖ్యతను చాటిచెప్పుతూ విద్యార్థులు ప్రదర్శనతో అలరించారు. నందికొట్కూరు మండలంలోని దామగట్ల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

చేనేత ఐక్య వేదికను బలోపేతం చేద్దాం

వెలుగోడు: జాతీయ చేనేత ఐక్య వేదికను బలోపేతం చేద్దామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన వెలుగోడు పట్టణంలో చేనేత కుటుంబాలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లడుతూ.. త్వరలో శ్రీశైలం మండల, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేనేత పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు అండగా ఉంటామని, వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో యాదాటి రవీంద్ర, నీలం వెంకటరామయ్య, గద్దె సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి

ఆత్మకూరు: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తలపెట్టిన బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల వద్ద పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు బాషా, రామాంజినేయులు, రవికుమార్ పాల్గొన్నారు

హెల్మెట్ ధరించాలి



విద్యార్థినికి హెల్మెట్‌ను బహుమతిగా అందజేస్తున్న ఆర్టీఓ తిమ్మరుసునాయుడు

జూపాడుబంగ్లా: ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆత్మకూరు ఆర్టీఓ తిమ్మరుసునాయుడు సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని నందికళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడి, ద్విచక్రవాహనాలు నడిపగలిగిన వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని సూచించారు. అలాగే మైనర్లు వాహనాలు నడపటం నేరమన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు హెల్మెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.